సాక్షి
నిర్మల్
ఆదివారం । 30 । మార్చి । 2025

తెలుగుదనం ఉట్టిపడేట్టు..



కాలంలోపాటు వస్త్ర ధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిప డేది మాత్రం పంచక ట్టులోనే. ఉమ్మడి జిల్లావాసులు పంచ కట్టుతో తెలుగు సం స్కృతిని చాటుతున్నారు. 8లో▸



నిలువ నీడ కరువు..

చదువులమ్మ కొలువుదీరిన బాసరలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. ఎండలోనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /24.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి కూడా వేడి సెగలు ఉంటాయి.

న్యూస్‌రీల్

డాక్టర్ చంద్రికకు ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎంపీ రఘు నందన్ రావు చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ చంద్రిక అవినాష్

నిర్మల్‌టౌన్: రాష్ట్రస్థాయిలో గైనకాలజీ, ఇన్‌ఫర్టిలిటీ విభాగంలో జిల్లా కేంద్రంలోని దేవీబాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ చంద్రిక అవినాష్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈ అవార్డును హైదరాబాద్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రిక మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. తనను ఆదరిస్తున్న పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మామడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

మామడ: మామడ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జానకీషర్మిల శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ వచ్చిన సమయంలో హెడ్ కానిస్టేబుల్ ఒక్కరే ఉండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సిబ్బంది డ్యూటీలు తెలుసుకున్నారు. ప్రతీరోజు విధుల నిర్వహణకు సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని అన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.సుదర్శనం తెలిపారు. 1912 టోల్‌ఫ్రీ నంబర్ 24/7 అందుబాటులో ఉంటుందని కార్పొరేట్ కార్యాలయం నుంచి టోల్‌ఫ్రీ నంబర్ సేవలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, బిల్లులో హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు, కేటగిరీ, లోడ్ మార్పు తదితర సమస్యల పరిష్కారానికి 1912 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్టీయూ భవన్ వేదికగా ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9:30 నుంచి ''ఉగాది కవి సమ్మేళనం, ఉర్దూ ముషాయిరా'' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్టీయూ, నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక, అప్పాల కావేరి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని కవితాగానం చేయాలని నిర్వాహకులు భూమన్న యాదవ్, తొడిశెట్టి పరమేశ్వర్, డా.చక్రధారి, వెంకట్, లక్ష్మణ్ తెలిపారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నిర్మల్ వాసి



అనుముల జగన్

నిర్మల్‌టౌన్: హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అనుముల జగన్ గెలుపొందారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి సురేందర్‌రెడ్డిపై 990 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు.

పన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్

నిర్మల్‌టౌన్: ఈనెల 30 ఉగాది, 31 రంజాన్ పండగ సెలవు దినం రోజు కూడా ఆస్తి పన్ను లు, నల్లా బిల్లులు చెల్లింపునకు నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ శనివారం ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు.

సంవత్సరఆది.. ఉగాది



క్రోధి ముగిసి, విశ్వావసుతో ఉగాది పండుగొచ్చింది. కాలగమనంలో మరో కొత్త ఏడాదిని తీసుకొచ్చింది. ఇంటిల్లిపాది ఆదివారం తెలుగు సంవత్సర'ఆది'ని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ప్రధానంగా వ్యవసాయ కుటుంబాల్లో ఉగాది పండుగ చాలా ప్రత్యేకమైంది. పండుగకు ముందస్తుగానే రైతుకుటుంబాలు సిద్ధమవుతాయి. తమ ఇళ్లల్లో గ్రహబలం ఉన్నవారి పేరిట కొత్త పంచాంగాల్లో ముహూర్తాలు చూపించి, ఉగాది పర్వదినాన పంటక్షేత్రాల్లో కొత్త ఏడాదికి సంబంధించి వ్యవసాయ పనులను ఆరంభించనున్నారు. అలాగే కొత్త ఏడాదికి సంబంధించిన కౌలు లెక్కలు, పాలేర్ల జీతాలనూ ఉగాది రోజే మాట్లాడుకుంటారు. – భైంసా

- సాగు పనులకు ముహూర్తం
- కౌలు, జీతాల లెక్కలకు శ్రీకారం
- గ్రామ గ్రామాన పంచాంగ పఠనం
- పప్పు బూరెలతో భోజనం ప్రత్యేకం
- ఇంటింటా షడ్రుచుల పచ్చడి



భైంసాలో ఉగాది రోజు సాగు పనులు ప్రారంభిస్తున్న రైతు (ఫైల్)

పంటభూమిలో పూజలు..

ఉగాది వస్తోందంటే ప్రధానంగా పల్లెలు కోలాహలంగా కనిపిస్తాయి. రైతు కుటుంబాలు తమ ఇళ్లను శుద్ధి చేసి పెట్టుకుంటారు. కొత్త పంట ఉత్పత్తులు, కొత్త చింతపండు, కొత్త కారం, మామిడికాయలు, వేప చిగురు ఇలాఅన్నీ సిద్ధం చేసి ఉంచుకుంటారు. తమ పంటభూముల్లో సాగుపనులు ప్రారంభించేందుకు ఇప్పటికే పంచాంగాలు చూపించారు. పండుగ రోజు వేకువ జామునే ఎవరి కంటపడకుండా పంట పొలాలకు వెళ్లి పూజలు చేస్తారు. పంట భూమిలో పంచపాండవులను ప్రతిష్ఠించి, ఇంటి నుంచి తీసుకెళ్లిన నీటితో శుద్ధి చేసి పసుపు, కుంకుమలు చల్లి తమ వెంట తీసుకెళ్లిన అరకలు, వ్యవసాయ పనిముట్లకు పూజలు చేస్తారు.

ఉగాది రోజే కొత్త సంవత్సర వ్యవసాయ పనులను సైతం ప్రారంభిస్తారు. ఇప్పటికే రైతులు తమ చేలల్లో పత్తి పంటను పీకేసి, భూములను చదును చేశారు. ఈ భూముల్లో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన పనుల శ్రీకారానికి రైతులు సన్నద్ధం అయ్యారు. ఈమేరకు అవసరమైన పరికరాల కొనుగోలు,



సాగు పనులకు శ్రీకారం..

తయారీ చేపట్టడంలో నిమగ్నమయ్యారు. వ్యవసాయమే జీవనాధారమైన గ్రామీణ రైతులు సంప్రదాయ బద్ధంగా ఉగాది పండుగను జరుపుకుంటారు. పండుగకు రెండుమూడు రోజుల ముందు నుంచే గ్రామాల్లో వడ్రంగులతో సాగుకు కావాల్సిన కర్రలు, దొరలు, గొడ్లను సరి చేయించుకున్నారు. ఇప్పటికీ ఎడ్లు, నాగళ్లు ఉన్నవాళ్లు అరకలను సిద్ధం చేయించి పెట్టుకున్నారు.

కులవృత్తుల వారికి ప్రత్యేకం...

గ్రామాల్లో ఉండే వడ్రంగి, కమ్మరి తదితర విశ్వబ్రాహ్మణ కులవృత్తుల వారు ఉగాది ఘనంగా నిర్వహిస్తారు. తమకు జీవనాధారమైన పనిముట్లకు పండుగరోజు ప్రత్యేక పూజలు చేస్తారు. పూజలు చేశాక నాలుగైదు రోజుల వరకు పనులు చేపట్టరు. కొత్త పంచాంగంలో మంచి ముహూర్తం చూసి తిరిగి పూజలు చేశాకే వాటిని తీసుకొని మళ్లీ పనుల్లో నిమగ్నమవుతారు.

గ్రామాల్లో గమ్మత్తుగా...

ఉగాది రోజు పనులు చేసిన రైతులంతా గ్రామాల చుట్టూ ఉన్న చెట్లకు తాళ్లు కట్టి ఉయ్యాలలు ఊగుతారు. కొన్ని గ్రామాల్లో ఆలయాల ముందు ఉండే బండరాళ్లను ఎత్తుకుని ఆలయం చుట్టు తిరుగుతారు. ఈ బండరాళ్ల బరువులెత్తే విషయంలో రైతులు పందేలు కాస్తారు.

కొత్త పనుల్లో పాలేర్లు...

కొత్త సంవత్సరంలో రైతుల వద్ద పాలేర్లుగా నియామకమైన వారంతా ఉగాదిరోజే పనుల్లో చేరుతారు. తమ కొత్త యజమాని వద్ద వ్యవసాయ పనుల్లో చేరి వచ్చే సంవత్సరం వరకు అక్కడే పని చేస్తారు. అనంతరం సాయంత్రం గ్రామాల్లో కబడ్డీ ఆడుతారు. పంట పొలాల్లో నుంచి తిరిగి వచ్చిన తర్వాత గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పంచాంగ పఠనం చేయిస్తారు. కొత్తసంవత్సరంలో ఏయే పంటలకు ధరలు ఉంటాయో కాలచక్రం ఏ విధంగా ఉంటుందో పంచాంగకర్తలు వెల్లడిస్తారు.

ప్రత్యేకతలెన్నో...

ఉగాది అంటే షడ్రుచుల పచ్చడి ఒక్కటే కాదు.. జిల్లాలో సాగు పనులు ప్రారంభించడం, బూరెల భోజనమూ పండుగ ప్రత్యేకమే. ప్రధానంగా భైంసా డివిజన్, నిర్మల్ డివిజన్‌లోని కొన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా చేస్తారు.

- చాలామంది రైతులు పంట పొలాల్లో పూజలు చేసిన తర్వాత తెలిసిన వారిని పిలిచి అక్కడే భోజనాలు ఏర్పాటు చేస్తారు.
- ఇళ్లలోనుంచి అంబళ్ల కుండలతో వంటలు చేసుకొని పంట పొలాలకు వెళ్తారు.
- పూజలు చేశాక తమతో వచ్చిన వారికి అంబళ్లను తాగించి అక్కడే భోజనాలు పెడతారు.
- భోజనాలు చేశాక అందరితో కలిసి కాసేపు వ్యవసాయ పనులు చేస్తారు.
- తమ ఇంటి మహిళలపై ఉన్న బంగారాన్ని ఒక ఆకులో చుట్టి నేలలో పాతి పెడతారు.
- దుక్కిదున్నిన తర్వాత ఆకును ఇంటి వారు తీసుకొని భూమాత తమకు కొత్త సంవత్సరంలో బంగారం లాంటి పంటలు ఇస్తుందని సంబుర పడుతారు.
- ఇక దుక్కిదున్నిన వారు, అంబళ్ల కుండలు నెత్తిన మోసిన వారు దినమంతా నిద్రపోకుండా గ్రామ శివార్లు దాటి వెళ్లకుండా నియమాలు పాటిస్తారు.
- సాయంత్రం వేళ ఇళ్లలో పప్పుబూరెలు చేసి వ్యవసాయ కూలీలకు తమ వద్ద పని చేసే పాలేర్లకు భోజనాలు పెట్టి, అనంతరం ఇంటిల్లిపాది ఆరగిస్తారు.
- ఎప్పుడూ ప్యాంటు, చొక్కా వేసే వాళ్లు సైతం ఉగాది రోజున చక్కగా పంచకట్టుతో పొలాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఉగాది నుంచే కొత్తఏడాది..

మనప్రాంతంలో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉంటుంది. వ్యవసాయం చేసే రైతు కుటుంబాల వాళ్లం పండగను ఘనంగా జరుపుకుంటాం. సంప్రదాయబద్ధంగా ధోతీ కట్టి, తలపాగా చుట్టి ముహూర్త సమయాన పంటపొలంలో పూజలు చేసి, వ్యవసాయ పనులు ప్రారంభిస్తాం. అక్కడే భోజనాలు చేసి భూమాతకు పూజచేసి, చల్లగా చూడాలని వేడుకుంటాం. రైతు కుటుంబాలకు ఉగాది నుంచే కొత్త ఏడాది మొదలవుతుంది.
–తూము దత్తు, భైంసా

నిర్మల్ పంచాంగం @ 95ఏళ్లు



పంచాంగం రాసిన గాడిచర్ల నారాయణసిద్ధాంతి(ఫైల్)



పుష్పగిరి పీఠాధిపతికి పంచాంగం ఇస్తున్న నాగేశ్వరసిద్ధాంతి

- నిర్మల అంబయ్యసిద్ధాంతి శిష్యులుగా..
- నిర్విరామంగా అందిస్తున్న 'గాడిచర్ల'
- 'గుడి' కుటుంబం నుంచీ రచన

నిర్మల్: వందల ఏళ్ల చారిత్రక నేపథ్యమున్న నిర్మల్‌లో ఉగాది పర్వదినానికీ ప్రత్యేకత ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన 'నిర్మల పంచాంగం' ఇక్కడే మొదలైంది. శైవపీఠాధిపతిగా, శివారాధకులుగా పేరొందిన నిర్మల అంబయ్య సిద్ధాంతి జ్యోతిష్యశాస్త్రంలోనూ పట్టుకలిగి ఉండేవారు. పౌరోహితులుగా ఉండి వారి వద్ద నుంచి బ్రహ్మపురికి చెందిన గాడిచర్ల నారాయణసిద్ధాంతి, గుడి రాజేశ్వరశర్మ, గుడినర్సింహ పంచాంగ రచనను ప్రారంభించారు.

నిర్విరామంగా..
నిర్మల్‌లోని బ్రహ్మపురి రథాలగుడి ఎదురుగా ఉన్న గాడిచర్ల నారాయణసిద్ధాంతి తన 20వ ఏట నుంచే పంచాగం రాస్తున్నారు. మొదట్లో తన గురువులు నిర్మల అంబయ్యసిద్ధాంతి, చెన్నూరు మత్స హన్మత్‌సిద్ధాంతి సహకారంతో వరంగల్‌లో పంచాంగాన్ని ముద్రించారు. గాడిచర్ల నిర్మల పంచాంగం పేరిట ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అప్పట్లోనే మంత్రులు, ప్రముఖులు గాడిచర్ల పంచాంగాన్ని అనుసరించేవారు. ఏకంగా 64 ఏళ్లపాటు పంచాంగాన్ని అందించిన నారాయణసిద్ధాంతి మరణానంతరం ఆయన దత్తపుత్రుడు గాడిచర్ల నాగేశ్వరశర్మ సిద్ధాంతి ఆ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికీ పంచాంగ రచన కొనసాగిస్తున్నారు. ఈయన 35వ ఏట నుంచి రాస్తున్నారు. గత 95ఏళ్లుగా ఏ ఒక్క ఏడాది కూడా ఆపకుండా పంచాంగాన్ని ప్రజలకు అందిస్తూ వస్తున్నారు.

నిర్మల్ ప్రత్యేకం..
రాష్ట్రంలో ఎంతోమంది పంచాంగాలను రాస్తున్నా.. నిర్మల్ సిద్ధాంతుల పంచాంగానికి మంచి పేరుంది. బ్రహ్మపురికే చెందిన గుడి రాజేశ్వరశర్మ సిద్ధాంతి, గుడినర్సింహ సిద్ధాంతి ఏళ్లపాటు పంచాంగ రచన కొనసాగించారు. మధ్యలో కొంత విరామం వచ్చినా మళ్లీ వారి వారసుడిగా గుడి ఉమామహేశ్వరశర్మ పంచాంగాన్ని రాస్తున్నారు. ప్రతీ ఉగాదికి నిర్మల్ పంచాంగాలను ఈ సిద్ధాంతులు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

పూర్వజన్మ సుకృతం..



గాడిచర్ల నిర్మల పంచాంగాన్ని ఏటా నిర్విరామంగా అందించే భాగ్యం కలుగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. రథాలగుడి కాశీవిశ్వేశ్వరుడి ఆశీస్సులతో శ్రీవిశ్వావసునామ సంవత్సరం అంతా బాగుండాలని కోరుకుంటున్నాను.
– గాడిచర్ల నాగేశ్వరసిద్ధాంతి, నిర్మల్

'ఎడారి గోస'కు కాసింత ఊరట

- గల్ఫ్‌మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం
- రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఆర్థికచేయూత
- జిల్లాకు రూ.35 లక్షలు విడుదల..



గల్ఫ్ బాధిత కుటుంబీకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి ఉపాధి కోసం ఎడారిదేశాల బాట పట్టిన వలస కార్మికులు అనుకోని ప్రమాదాల్లో, అనారోగ్య కారణాలతో అక్కడే తుదిశ్వాస విడిస్తే అతనిపై ఆధారపడిన కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. వలస కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు చాలా ఏళ్లుగా పోరాటాలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం వలస కార్మికుల కోసం భరోసానిచ్చేలా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చేందుకు గతంలోనే ఉత్తర్వులిచ్చింది. మార్చి 2న తొలివిడతలో జిల్లాకు రూ.25 లక్షలు విడుదల చేసింది. ఒక్కో మృతుడి కుటుంబ సభ్యులు అకౌంటులో రూ.5 లక్షలను జమచేసింది. తాజాగా శుక్రవారం రెండోవిడత మరో రూ.35 లక్షలు బాధిత కుటుంబాలకు మంజూరు చేసింది. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వలస కార్మికుల కుటుంబాలకు ఈ నగదు కాసింత ఆర్థిక భరోసా ఇవ్వనుంది.

గల్ఫ్ గాయాలు నిత్యకృత్యమే...
ఎన్నో దశాబ్దాలుగా ఉపాధి కోసం విదేశాల బాట పడుతున్న కార్మికులు అక్కడ అనుకోని ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం కొన్ని నెలల క్రితం గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు జీవో 205 విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం గత డిసెంబర్– 2003 నుంచి ఇప్పటి వరకు గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కుటుంబానికి రూ.5 లక్షలు అందించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాల్లో దాదాపు 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాదులోని ప్రజాభవన్‌లో కూడా ప్రవాసీ ప్రజావాణి పేరిట ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని కూడా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కూడా బాధితగల్ఫ్ కార్మికుల సమస్యల నివేదన కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవతో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశారు.

నిర్మల్ జిల్లాలో ఇలా...
నిర్మల్ జిల్లాకు చెందిన ఏడుగురు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రెండవ విడతలో ఈ పరిహారం దక్కింది. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆయా బాధిత కుటుంబ సభ్యుల అకౌంట్లో నగదు జమ కానుంది. కడెం మండలం పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన బత్తుల నరసయ్య, ఇదే మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ నబి రసూల్, మామడ మండలం కొరటికల్ గ్రామానికి చెందిన గువ్వల రవి, ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన పులకం రాజేశ్వర్, లక్ష్మణచాంద మండలం బోరేగాం గ్రామానికి చెందిన మక్కల వెంకటి, ముధోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన మల్లెపూల సాయన్న, సారంగాపూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన అప్పాల నవీన్ కుటుంబసభ్యులకు ఈ పరిహార జాబితాలో చోటుదక్కింది..

ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల...

గత 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు గల్ఫ్ దేశాల్లో 200 మందికి పైగా తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం తొలివిడతగా ఈనెల 1న 113 కుటుంబాలకు రూ.5.65 కోట్లు, రెండవ విడతలో ఇదే నెల28న(గత శుక్రవారం) 66 కుటుంబాలకు రూ.3.3 కోట్లు ఆయా జిల్లాలకు విడుదల చేసింది. ఇందులో తాజాగా నిర్మల్ జిల్లాకు రూ.35 లక్షలు కేటాయించి బాధిత కుటుంబాల అకౌంట్లలో జమచేశారు.

రాష్ట్ర ప్రభుత్వం చొరవ హర్షణీయం..

ఉపాధి కోసం ఎడారి దేశాల బాట పడుతున్న కార్మికులు ఎందరో విగత జీవులుగా స్వస్థలాలకు వస్తున్న ఘటనలు జిల్లాలో కనిపిస్తాయి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున బాసటగా నిలవడం వారికి భరోసా ఇస్తుంది. విడతల వారీగా జిల్లాలోని బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించడం సంతోషం. ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు కొంతమేర ప్రయోజనం కల్పిస్తుంది.
– స్వదేశ్ పరికిపండ్ల, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రవాసీమిత్ర కార్మికసంఘం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు

- పలువురు అభ్యర్థులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మెడికల్ కళాశాల గత సంవత్సరం నవంబర్ 4న విడుదల చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగాల భర్తీ అనుభవం ప్రామాణికంగా కాకుండా డబ్బే ప్రామాణికంగా చేశారని పలువురు అభ్యర్థులు కలెక్టరేట్ ఏవోకు శనివారం వినతిపత్రం అందించారు. గతంలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆధీనంలో ఉన్న నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహించిన వారికి ఈ నియామకంలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారన్నారు. శుక్రవారం విడుదల చేసిన 52 మంది జాబితాలో ఒక్కరు కూడా అనుభవం ఉన్నవారు లేరని తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకులు డబ్బుల కోసం అనుభవం ఉన్నవారిని పక్కన పెట్టారని ఆరోపించారు. ఫలితంగా కొన్నేల్లుగా జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 18 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అధికారులు విచారణ జరిపి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అప్పటివరకు నియామక ప్రక్రియ నిలిపివేయాలన్నారు. నిరసనలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నరహరి, రవి, సుమ, మమత, రమేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

'పది' పరీక్షకు 11 మంది గైర్హాజర్

నిర్మల్ రూరల్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలో నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 9,129 మంది విద్యార్థులకు గాను 9,118 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. డీఈవో రామారావు జిల్లా కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల అధికారి మురారపు పరమేశ్వర్ సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

లక్ష్మణచాంద: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఈవో రామారావు శనివారం తనిఖీ చేశారు. వడ్యాల్, లక్ష్మణచాందలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతంను సీఎస్‌లను అడిగి తెలుసుకున్నారు. వడ్యాల్‌లో 168, లక్ష్మణచాందలో 174 మంది విద్యార్థులు హాజరయ్యారని సీఎస్ తెలిపారు. డీఈవో వెంట ఎంఈవో అశోక్ వర్మ, సీఎస్‌లు భూషణ్, మోహన్ ఉన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్‌లో ఎంజేపీ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్మల్ ఎంజేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ డిగ్రీ కళాశాలలో (బాలురు) గణితం, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో బాటనీ, ఫిజిక్స్, గణితంలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. వివరాల కోసం నిర్మల్ 9505520097, ఆదిలాబాద్ 889760 2060 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఖోఖో జట్టు సారథిగా ప్రశాంత్


మడావి ప్రశాంత్

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర ఖోఖో సీనియర్ జట్టు సారథిగా జిల్లా క్రీడాకారుడు మడావి ప్రశాంత్ ఎంపికయ్యాడు. జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు వరంగల్‌లో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రశాంత్ రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం బుర్సన్‌పటార్‌- కోలాంగూడ గ్రామానికి చెందిన కాన్షీరాం-అయ్యుబాయి దంపతుల కుమారుడు ప్రశాంత్ ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం పూరి జిల్లాలో జరగనున్న 57వ ఖోఖో సీనియర్ జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో శిక్షకుడిగా వ్యవహరిస్తున్న బొజ్జం రంజిత్ తెలంగాణ జట్టు కోచ్‌గా, జిల్లాకు చెందిన మరో క్రీడాకారుడు పి.మధు సైతం జిల్లా నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇక మహిళల విభాగంలో కె.నాగేశ్వరి రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

పశువుల పాక దగ్ధం

కుభీర్: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధమైంది. పశువుల సొప్ప, వ్యవసాయ పనిముట్లు, ఒక సైకిల్, పాకకు ఉన్న రేకులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. సుమారు 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు మంగి తుకారాం తెలిపారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

తెలుగుదనం ఉట్టిపడేట్టు

- ఆహార్యంలో పంచకట్టు ఠీవీ..
- ప్రత్యేకత చాటుకుంటున్న ఉమ్మడి జిల్లా వాసులు



పంచకట్టు.. సంప్రదాయ వస్త్రధారణ. కాలంలోపాటు వస్త్రధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిపడేది మాత్రం పంచకట్టులోనే. వృత్తులు, విధులు, ఉద్యోగాల రీత్యా వస్త్రధారణ వేరుగా ఉంటుంది. అయినా ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు నేటికీ సంప్రదాయ పంచకట్టులో ఠీవీ చాటుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయాన్ని భావితరాలకు అందిస్తున్నారు. వస్త్రధారణ ఆధారంగానే 'మాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా'.. మేం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులం' అని చెప్పకనే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు తెలుగుదనం ఉట్టిపడేలా ఇప్పటికీ తెల్లని చొక్కా, ధోవతి, కండువా ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు సంస్కృతిని చాటి చెప్తున్నారు.

పెద్దల నుంచి వస్తున్న ఆచారం


కేమ లక్ష్మణ్

తాంసి: తెలుగుదనం ఉట్టిపడేలా, నిండు గంభీరంగా కనిపిస్తున్న ఈ రైతు తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కేమ లక్ష్మణ్. దశాబ్దాల నుంచి ప్రతీరోజు తెల్లని చొక్కా, దోవతి, కండువా ధరించి తెలుగు రైతుకు నిర్వచనంలా కనిపిస్తాడు. తమది వ్యవసాయ కుటుంబమని, తమపెద్దలు ఆచరించినట్లుగా తాను కూడా తెలుగు రైతు సంప్రదాయాన్ని కచ్చితంగా పాటిస్తూ ఉంటానని పేర్కొంటున్నాడు.

సంప్రదాయం మరవలేదు


మల్లెపూల నర్సయ్య

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నర్సయ్య తెలుగు సంస్కృతికి అద్దంపట్టేలా 40 ఏళ్లుగా పంచెకట్టు (దోవతి) ధరిస్తున్నాడు. 1981లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరి 2001, 2019లో బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉన్నత చదువులు చదివినా రాజకీయాల్లో రాణిస్తున్నా తెలుగు సంప్రదాయ కట్టుబాట్లను ఇప్పటికీ ఆచరిస్తున్నారు.

తెలుగులోనే సంతకం


భవాని ఆనంద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భవానీ ఆనంద్ అర్లి బి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. అతనికి చిన్నతనం నుండి తెలుగు భాష అంటే అభిమానం. అందరూ ఇంగ్లిష్‌లో సంతకం చేస్తున్నా తనుమాత్రం 40 ఏళ్లుగా తెలుగులోనే చేస్తున్నారు. తెలుగుపై తనకున్న అభిమానం చాటుకుంటున్నార

'సరికొత్త ఉగాది'



అదిగదిగో..
వస్తోంది
విశ్వావసు
నామ సంవత్సర
ఉగాది!
తెలుగు
కొత్త సంవత్సరంలో
వెలుగులు విరజిమ్ముతూ..
కొత్త ఆశల చిగుర్లతో
పాత క్యాలెండరుని పారద్రోలి..
ఓ కొత్త తెలుగు క్యాలెండర్‌గా ఉనికిని
చాటడానికి!!
విశ్వావసు క్రాంతితో..
తెలుగువారి లోగిళ్లలో..
వస్తున్నాదదిగో కొంగొత్త కాంతితో..
సరికొత్త ఉగాది!!
షడ్రుచుల కొత్త మేళవింపు
వసంతాన్ని వెంటబెట్టుకొని
చైత్రంతో సరాగాలాడుతూ
లేత మామిడి చిగురులు
మానవాళికి ఓ తాంబూలం
కొమ్మలపై కూర్చున్నా కోకిలమ్మలు
మధురంగా కూస్తూ
విశ్వావసును స్వాగతిస్తున్నాయి
మానవాళికి కొత్త సందేశానిస్తున్నాయి..
రైతన్నల కళ్లలో పరిఢవిల్లే ఓ కొత్తకాంతి..
నిజమైన ప్రశాంతి విశ్రాంతి!!
ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు పరిచి..
రతనాల రంగులు వేసి స్వాగతం
పలుకుదాం!!

– అంబటి నారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు, చామన్‌పెల్లి పాఠశాల

సేకరణ: లక్ష్మణచాంద

ఈ ఉగాది.. కొత్త పునాది



తెలతెల్లవారే
కోయిల రాగాలతో
పచ్చని మామిడి
తోరణాలతో
ముంగిట హరివిల్లు
రంగులతో
ఈ ఉగాది.. కొత్త
జీవితానికి పలికే నాంది..
నోరూరించే బూరెలతో
కోరికోరి చేసే పిండివంటలతో
షడ్రుచుల సమ్మేళన పచ్చడితో
ఈ ఉగాది.. జీవనపోరాటానికి పునాది..
చిన్నపెద్దల నూతన వస్త్రాలతో
సంస్కృతీ సంప్రదాయాల
కొత్తపండుగతో
శ్రీవిశ్వావసు నామ సంవత్సరంతో
ఈ ఉగాది.. విశ్వాసానికి వారధి..

– ఆయిటి సాహితి, యువకవి, నిర్మల్

సేకరణ: నిర్మల్

'విశ్వావసు'కు స్వాగతం పలుకుదాం



అణగారిన గుండెగూళ్ల నిండా ఆశల ఊసులు అల్లుతూ..
స్నేహ సౌరభాల తోరణాలతో 'విశ్వావసు'కు స్వాగతం
పలుకుదాం..
సమస్యలను, సవాళ్లను సమర్థవంతంగా
ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకెళదాం..
తీపి జ్ఞాపకాల మధురిమలో గత చేదు మరచి..
మమకారాల మాధుర్యాన్ని నలుగురితో పంచుతూ ఆశగా జీవితాన్ని ప్రేమిద్దాం.

– రాఘవేంద్ర దారవేణి, తాంసి, ఆదిలాబాద్

సేకరణ: తాంసి

శ్రీ విశ్వావసు వత్సరమా! స్వాగతం



శ్రీ విశ్వావసు వర్షమా
స్వాగతం సుస్వాగతం
కొత్త ఉషస్సులతో..
కొంగొత్త జీవితాలనీయ..
కులమతాల అడ్డుగోడలు కూలిపోవాలని..
పసిడి పంటల రాసులతో గాదెలు నిండాలనీ..
పేద, ధనిక లేని సమసమాజం రావాలని..
మతహింస రక్కసికి మరణశాసనం రాయాలని..
మానవత్వపు విరులు ప్రతీ ఎదలో వెల్లివిరియాలని..
ఉత్తర, దక్షిణ ప్రాంతీయ భేదాలు సమసిపోవాలని..
కుళ్లు రాజకీయాలకు చెల్లు చీటి రాయాలని..
సుఖశాంతుల నిలయమై వసుధ వర్ధిల్లాలని..
ప్రేమ, మైత్రి విశ్వమంతా ఆవహించాలని..
నవ శకానికి నాంది పలుకాలని..
చైత్రమాసంలో వసంతుడు పలికే..
ఓ నవవర్ష పర్వమా స్వాగతం స్వాగతం..
తీపి, వగరు, చేదు, కారం, ఉప్పు, పులుపు
షడ్రుచుల పచ్చడి..
నవజీవన సారమని అందించ యుగాది..
తొలి పర్వమై ఏతెంచె శ్రీ విశ్వావసు వర్షము..
సర్వజనహితమును చేకూర్చ..
సత్సంబంధాలు నొసగ..
ఓ విశ్వావసువత్సరమా! స్వాగతం! స్వాగతం

– గంగుల చిన్నన్నా, తెలుగు ఉపాధ్యాయుడు, భోసి

సేకరణ: తానూరు

ఉగాది అంటే



పంట చేనుకు,
పంచే మనిషికి
ముడిపడిన వేదిక
బసవన్నల నడకకు, కలుపు
మొక్కల
అంతానికి వేదిక
అందరికీ నూతన
సంవత్సరం
అన్నదాత శ్రమకు ముహూర్తం
మామిడి చెట్లకు పిందెలు
మోతుకు చెట్లకు పువ్వులు
పంట చేలల్లో పందిళ్లు
పండిన మేత తింటున్న గొడ్డుగోదలు
తెల్లారకముందే గంటల చప్పుళ్లు
పందిళ్ల కింద గుడాల బుక్కుళ్లు
ఈ విశ్వవసు నామ సంవత్సరంలో
న్యాయంగా బతకాలి
మన దేశం నుంచి అవినీతి పారిపోవాలి
అందరి కష్టాలు దూరమవ్వాలి
ప్రజలందరి ముఖంలో సంతోషం
వెదజల్లాలి

రచన: చిల్క సతీష్, యాపల్ గూడ, ఉపాధ్యాయుడు

సేకరణ: ఆదిలాబాద్ టౌన్

తొలి వేకువజామున వసంత కోకిల



స్వరాల
సరాగాలు
వినిపిస్తుంటే..
ముడుచుకున్న
ఆలోచనలు
స్నిగ్ధమనోహరంగా
మనస్సు పొరల్లో
విచ్చుకోవాలి..!
కలల వాకిళ్లపై ఆశల కల్లాపి చల్లి
అంతరంగిక లోగిళ్ల నిండా
వసంత వేడుకలు ఆవిష్కృతమవ్వాలి..!
ప్రతినోటా స్వచ్ఛమైన సత్యం
ఉషస్సులా ఉదయించాలి..!!

– పసుల ప్రతాప్, ఉపాధ్యాయుడు, ఆదిలాబాద్

సేకరణ: ఆదిలాబాద్ టౌన్

బియ్యం లారీ పట్టివేత

ఇచ్చోడ: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న లారీని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ముందస్తు సమాచారంతో మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. లారీలో 290 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. లారీడ్రైవర్ సిడాం మోతిరాంతోపాటు వెంకటరాజు, సీతారామరాజు, కైపు ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు టోకరా

- రూ.16 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- ఆదిలాబాద్‌లో ఘటన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌నేరగాళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు టోకరా వేశారు. ఇంట్లో కూర్చుని లక్షలు సంపాదించవచ్చనే ఆశచూపి రూ.16 లక్షలను దండుకున్నారు. పట్టణంలోని నేతాజీచౌక్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల టెలిగ్రామ్‌లో లింక్ పంపారు. లైక్ చేస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. ఆయనకు మొదట నమ్మకం కుదిరేలా రూ.10 వేల నగదును సదరు వ్యక్తి బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. రెండింతల డబ్బులు వస్తాయని నమ్మించారు. దీంతో ఆయన ఈనెల 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా తొలుత రూ.50 వేలు, ఆ తర్వాత రూ.2 లక్షలు, ఇలా మొత్తం రూ.16 లక్షల 79 వేలను సైబర్ మోసగాళ్లకు సమర్పించుకున్నాడు. తన వద్ద ఉన్న డబ్బులే కాదు బ్యాంకులో లోన్ తీసుకుని మరీ వారికి చెల్లించాడు. తీరా ఆయన అకౌంట్‌లో డబ్బులు జమకాకపోవడంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నాడు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు.

పెద్దమ్మ గుడిలో చోరీ


బయట పడేసిన హుండీ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని పెద్దమ్మ గుడిలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆలయ తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లాడు. అందులో నగదును తీసుకుని పక్కనే ఉన్న వాగు పరిసర ప్రాంతంలో హుండీని పడేశాడు. శనివారం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని తెలిపారు.

యువకుడిని కాపాడిన మహిళా పోలీసులు


యువకుడిని కాపాడిన మహిళా పోలీసులు

నిర్మల్‌రూరల్: ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన యువకుడిని రూరల్ మహిళా పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా..జిల్లా కేంద్రానికి చెందిన బిజ శ్రీకాంత్ జీవితంపై విరక్తి చనిపోదామని నిర్ణయించుకున్నాడు. మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్దకు శనివారం చేరుకుని ఆత్మహత్యకు యత్నించాడు. డయల్ 100 ద్వారా విషయం తెలుసుకున్న మహిళా పోలీసులు రజిత, శ్రావలికలు సంఘటన స్థలానికి వెళ్లి శ్రీకాంత్‌ను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమేరకు మహిళా పోలీసులను ఎస్సై లింబాద్రి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్ పంచాయతీ పరిధి చెన్నూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. చెన్నూర్ సమీపంలో ఈనెల 25న టిప్పర్ బైక్ ఢీకొనడంతో తీవ్రగాయలైన శంకర్‌గౌడ్(42) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


కొండ్ర రామ్‌రెడ్డి (ఫైల్)

సోన్: మండలంలోని కడ్తాల్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కడ్తాల్ గ్రామానికి చెందిన కొండ్ర రామ్‌రెడ్డి (39) శుక్రవారం రాత్రి తన ఎలక్ట్రికల్ బైక్‌పై రాత్రి సమయంలో తన తోటలోకి వెళ్లి తిరిగివస్తున్నాడు. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ పరారయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామ్‌రెడ్డిని వెంటనే నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న కొండ్ర రాజారెడ్డి ఫిర్యాదుతో ఎస్సై గోపి శనివారం కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలోని నసీరాబాద్‌లో 61వ జాతీయ రహదారిపై ఈనెల 17న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రాంపూర్ గ్రామానికి చెందిన గుండోజి నాగార్జున, శ్రీరామ్ వెంకటరమణ గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం శ్రీరామ్ వెంకటరమణను హైదరాబాదులోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

టీజీఎల్ కంపెనీపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని మావలలో కొనసాగుతున్న ట్రూ లీడ్ జనరేషన్ (టీజీఎల్) సేల్స్ మార్కెటింగ్ కంపెనీపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. టీజీఎల్ ట్రైనింగ్ యూనిట్‌లో కొందరు యువతి, యువకులకు మార్కెటింగ్ పేరిట శిక్షణ అందజేస్తూ కొంతమేర ఫీజులు తీసుకుంటున్నారు. ఇతరులను మరికొందరిని చేర్పించాలని, అదనంగా ఫీజు చెల్లించాలని అప్పుడే మార్కెటింగ్ కోసం వస్తువులు ఇస్తామని నిర్వాహకులు సూచించారు. శిక్షణ తీసుకుంటున్న యువతి పాటిల్ గంగోత్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిర్వాహకుల ఫిర్యాదుతో..

టీజీఎల్ కంపెనీ డబ్బులు ఇవ్వాలని, లేకపోతే కంపెనీ ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించిన పలువురి కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపా రు. కొందరు విద్యార్థి సంఘాల నాయకులు డబ్బులు ఇవ్వాలని మూడు నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిర్వాహకుల ఫిర్యాదుతో అక్షయ్, నిఖిల్, కార్తీక్ తోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.